



# కరపత్రం

SINCE 2014

మంగళవారం డిసెంబర్ 2 2025 సంపుటి : 2 సంచిక : 58 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4






## పాలమూరు బిడ్డగా

# ఈ గడ్డను అభివృద్ధి చేస్తా

- బూర్గుల తరవాత నాకే అవకాశం ఇచ్చారు
- దశాబ్దాల జిల్లా కరువును పారదోలుతా
- గత పదేళ్ల బిఆర్ఎస్ కాలంలో తీవ్రనిర్లక్ష్యం
- ఉమ్మడి ఎపిలోనూ..తెలంగాణలోనూ జిల్లా నిర్లక్ష్యం
- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తా
- సర్పంచ్‌లుగా మనవారినే గెలిపిస్తే మంచిది
- మక్తల్ సభలో సిఎం రేవంత్ రెడ్డి

**నారాయణపేట,డిసెంబర్1 :**

పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులను పదేళ్లపాటు గత బిఆర్ఎస్ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, ప్రత్యేక తెలంగాణలోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఈ ప్రాంతానికి ఏదైనా చేయాలని గతంలో ఏ నేత కూడా అనుకోలేదని విమర్శించారు. అందుకే ఈసారి ఇక్కడి ప్రజలు 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించారన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావొస్తుంది. రెండేళ్ల విజయోత్సవ సభను మక్తల్‌లో నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి బూర్గుల రామకృష్ణారావు సీఎం అయ్యారు. ఆ తర్వాత 75 ఏళ్లలో ఎవరూ కాలేదు. ఇన్నాళ్లకు పాలమూరు బిడ్డ రాష్ట్ర సీఎంగా మీ ముందు నిలబడ్డారు. పాలమూరుకు ఏది కావాలన్నా చేసి మీ రుణం తీర్చుకుంటానని అన్నారు. దశాబ్దాలుగా పాలమూరు జిల్లా కరవు, వలసలకు మాత్రమే పేరు పొందింది. ఇక్కడి నుంచి ఎంపీగా చేసిన మాజీ సీఎం కెసిఆర్ కూడా ఈ జిల్లాకు ఏం చేయలేదు. ప్రాజెక్టులను పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారు.



## తక్కువ వడ్డీతో

# రుణాలు మంజూరు చేయండి...

- హడ్కో ఛైర్మన్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- ప్రతిష్టాత్మక ప్రాజెక్టులపై చర్చ

**హైదరాబాద్,డిసెంబర్1 :**

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హడ్కో ఛైర్మన్ సంజయ్ కులశ్రేష్ఠను కోరారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కులశ్రేష్ఠ సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్ మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్ల నిర్మాణాలకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని సీఎం హడ్కో ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి బెంగళూర్, అమరావతి మీదుగా చెన్నై వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారులు, బందరు పోర్ట్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి, బులెట్ ట్రైన్ నిర్మాణాలపై ముఖ్యమంత్రి... హడ్కో ఛైర్మన్‌ల మధ్య చర్చ సాగింది. గతంలో అత్యధిక వడ్డీ రేటుతో ఇచ్చిన రుణాలకు సంబంధించి రుణ పునర్వ్యవస్థీకరణ (లోన్ రీకన్‌స్టక్చన్) అంశాన్ని సీఎం హడ్కో ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.

## తెలంగాణ మహిళా సంఘాలకు మరో 448 అద్దె బస్సుల కేటాయింపు

**హైదరాబాద్:**



తెలంగాణలోని మహిళా సంఘాల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊతమిచ్చింది. మహిళా సంఘాలకు మరో 448 అద్దె బస్సులు కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ నిర్ణయాన్ని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రాష్ట్రంలో మహిళాశక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల ద్వారా బస్సులను కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మొదటి విడతలో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లోని 150 మహిళా సంఘాలకు 150 బస్సులను కొనుగోలు చేసింది.

2లో..



## మెట్రో రైలు భద్రతా విభాగంలో ట్రాన్స్‌జెండర్లు

**హైదరాబాద్:**

మెట్రో రైలు మరో కీలక నిర్ణయం తీసుకుంది. భద్రతా విభాగంలో ట్రాన్స్‌జెండర్‌లను నియమించింది. ప్రత్యేక శిక్షణ ఇచ్చి నియమించిన 20 మంది ట్రాన్స్‌జెండర్ సిబ్బంది డిసెంబర్ 1 నుంచి ఎంపిక చేసిన మెట్రో స్టేషన్లలో విధుల్లో చేరారు.

## ఫలించిన మంత్రి తుమ్మల చర్చలు..

# పత్తి కొనుగోళ్లపై తొలగిన ప్రతిష్టంభన

**హైదరాబాద్:**

రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లపై జిన్నింగ్ మిల్లులు, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మధ్య నెలకొన్న ప్రతిష్టంభన తొలగింది. సీసీఐ తీసుకొచ్చిన కొన్ని నిబంధనలను రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లులు వ్యతిరేకించడంతో ఇటీవల కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సమస్యపై దృష్టి సారించి.. సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో పలు దఫాలుగా చర్చలు నిర్వహించారు.



2లో




2లో

## సూపర్ సిక్స్ పథకాలను

# సక్సెస్ చేసి చూపాం

- » పెన్షన్ల పంపిణీ ఎపిలోనే ఎక్కువ
- » రాష్ట్రాన్ని గాడిలో పెట్టే పనిలో ఉన్నాం
- » అమరావతిని పరుగులు పెట్టిస్తున్నాం
- » గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి
- » మహిళలకు ఉచితబస్సు, సిలిండర్లు ఇస్తున్నాం
- » ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో సిఎం చంద్రబాబు

**ఏలూరు,డిసెంబర్1 :**

సూపర్ సిక్స్ పథకాలను సక్సెస్ చేసిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. పింఛన్లకు ఏపీ కంటే ఏ రాష్ట్రం కూడా ఎక్కువ ఖర్చుపెట్టడం లేదని తెలిపారు. సోమవారం ఏలూరు జిల్లాలోని గోపీనాథపట్నంలో చంద్రబాబు పర్యటించారు. మహిళ నాగలక్ష్మికి పెన్షన్ అందజేశారు. నల్లమాడులో స్టాళ్లను సీఎం, మంత్రులు పరిశీలించారు. అనంతరం ప్రసంగించారు. తాను, తన మిత్రుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఒకే విధంగా ఆలోచిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## రైతు వీరన్న ఆత్మహత్యకు

# ప్రభుత్వానిదే బాధ్యత

- ఆత్మహత్య కాదది.... ప్రభుత్వ హత్యే
- ఎక్స్ వేదికగా హరీష్ రావు ఆరోపణ



**హైదరాబాద్,డిసెంబర్1 :**

ఖమ్మం జిల్లాలో రైతు వీరన్న ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యతని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఈ ఘటనపై స్పందించిన అయన రైతు వీరన్న ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రైతుది ఆత్మహత్య కాదని.. ప్రభుత్వ హత్యే అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.కౌలు రైతుల రైతు భరోసాకు సంబంధించి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. కౌలు రైతుల బతుకులకు భరోసా లేకుండా చేస్తోందంటూ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. 'కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పి, నేడు వారి బతుకులకు భరోసా లేకుండా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో కౌలు రైతు బానోతు వీరన్న ఆత్మహత్య అత్యంత బాధాకరం. పురుగుల మందు తాగుతూ.. పండించిన పంటకు ధర రాక, అప్పులు తీర్చే దారిలేక చనిపోతున్నా అని వీరన్న తీసుకున్న సెల్ఫీ వీడియో కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి చేసిన మోసాలకు నిదర్శనం. వీరన్నది ఆత్మహత్య కాదు, ప్రభుత్వం చేసిన హత్యనే.

2లో..



2లో..

## హిల్ట్ పాలసీ పేరుతో

# వేలకోట్ల కుంభకోణం

- » 9 వేల ఎకరాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం
- » గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన బిజెపి
- » ప్రభుత్వ అక్రమాలకు నిరసనగా 7న ధర్నా

## డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై దర్యాప్తు చేయండి

### సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ



2లో




2లో

## దేశంలో ఏడో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా శామీర్‌పేట్ పీఎస్

**హైదరాబాద్:**



## లీజు భూములను కన్వర్షన్ చేసే అవకాశం ఇవ్వలేదు

### - మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్:**

హిల్ట్ పాలసీపై విపక్షం అవాస్తవాలు ప్రచారం చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు.

# పాలమూరు బిడ్డగాఈ గడ్డను అభివృద్ధి చేస్తా

మొదటిపేజీ తరువాయి

ఈసారి పాలమూరు బిడ్డను ప్రజలు గెలిపించి అధికారం కట్టబెట్టారని సీఎం రేవంత్ అన్నారు.
కేసీఆర్ రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ఆ అప్పులు తీరుస్తూనే.. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. అభివృద్ధిని అడ్డుకునే వాళ్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించొద్దు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నవాళ్లను గెలిపిస్తే.. గ్రామం అభివృద్ధి చెందదు. మంత్రుల వద్దకు వెళ్లి గ్రామానికి నిధులు అడిగే నేతలను సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలి. ఈసారి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించాం. పదేళ్లు నిర్లక్ష్యానికి గురైన నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాం. ఈ ప్రాజెక్టుపై కేసులు వేసి అడ్డుకున్నారు. రైతులు నష్టపోవద్దని ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇచ్చేందుకు ముందుకొచ్చాం. పాలమూరు జిల్లాలో కృష్ణానది పారుతున్నా.. ఇక్కడి నేలకు నీళ్లు అందలేదు. మాయగాళ్ల మాటలు విని.. ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను అడ్డుకోవద్దు. ఇరిగేషన్, ఎడ్యుకేషన్‌లను ప్రాధాన్య అంశాలుగా తీసుకున్నాం అని సిఎం రేవంత్ అన్నారు.
మక్తల్ పర్యటనలో భాగంగా రూ.200 కోట్లతో సమీకృత గురుకుల పాఠశాల సముదాయ భవనాలు, మక్తల్-నారాయణపేట మధ్య నాలుగు లైన్ల రోడ్డు, మక్తల్‌లో క్రీడాభవనం తదితర అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అంతకుముందు వనపర్తి జిల్లా ఆత్మకూరులో పర్యటించారు. రూ.151.92 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జూరాల దిగువన హైలెవల్ వంతెన నిర్మాణం, ఆత్మకూరు మున్సిపాలిటీలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో, ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన తర్వాత కూడా
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పట్టించుకోలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో జిల్లాకు తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే.. ఆటోడ్రైవర్లను మాజీ మంత్రి కేటీఆర్ అండ్ కో రెచ్చగొట్టి తమ మీదకు పంపుతున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు సీఎం. తమ ప్రభుత్వంలో పేదలకు కూడా సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తుచేశారు. మహిళలను వ్యాపార వేత్తలుగా మార్చేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. దేశానికి, రాష్ట్రానికి పాలమూరును ఆదర్శంగా మారుస్తామని వివరించారు. ఎన్ని నిధులు కావాలన్నా ఇచ్చేందుకు సిద్ధమని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వంలో ఇరిగేషన్‌తో పాటు ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి పేద బిడ్డకు చదువు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూళ్లు ప్రారంభించామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
ఇప్పటిదాకా మక్తల్ నారాయణపేట కొడంగల్‌కు సాగునీరు ఇవ్వాలని ఎవ్వరికీ అనిపించలేదు. కానీ 12 మందిని మీరు ఆశీర్వదించి పంపిస్తే నాకు ఇక్కడి ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చింది. మన కష్టాలను తీర్చేందుకు ఎవ్వరూ బాధ్యత తీసుకోలేదు. కానీ మీ సోదరుడిగా.. మీతో పాటు పెరిగిన బిడ్డగా సీఎంగా వచ్చాను. పాలమూరు గడ్డ ప్రేమిస్తే ప్రాణం ఇస్తుంది. కానీ మోసగిస్తే పాతాళానికి తొక్కింది.. ఇది కేసీఆర్ విషయంలో జరిగింది. గతంలో కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించి.. సీఎంగా చేస్తే.. మన జిల్లాలో ఎలాంటి ప్రాజెక్టు పూర్తి చేయలేదు. రూ.12 కోట్లు కేటాయించి సంగంబండ రిజర్వాయర్ పూర్తి చేయలేదు. అందుకే ఎవరికో పెద్దరికం ఇవ్వొద్దని.. మన బిడ్డ సీఎంగా ఉండాలని మీరు కోరుకున్నారు. మంత్రి మండలి సహకారంతో.. ఇక్కడ అన్ని ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తున్నాం.. గతంలో జీవో నెంబరు- 69 ద్వారా వచ్చిన నారాయణపేట - కొడంగల్ ప్రాజెక్టును పక్కన పెట్టారు. కానీ మేము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తున్నాం. ఇప్పటికీ కొంతమంది అడ్డంకులు పెట్టారు.. కానీ మా మంత్రి వాకిటి శ్రీహరి రైతులతో మాట్లాడి.. ఎకరానికి రూ.20 లక్షల పరిహారంతో 95 శాతం మంది రైతులు భూములు ఇవ్వడానికి ఒప్పుకోవడంతో పనులు ప్రారంభించాం. ఇది నా జీవితంలో చాలా సంతోషకరమైన విషయం. రెండు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తాం.. ఈ ప్రాజెక్టుకు ఎవరైనా అడ్డుపడితే ఊరుకోం' అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. 'విద్యాభివృద్ధి కూడా ముఖ్యం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను రూ. 200 కోట్లతో ఏర్పాటు చేశాం. యెన్నం శ్రీనివాస్ రెడ్డి అడిగిన వెంటనే ట్రిపుల్ ఐటీ కాలేజీ తెచ్చాం.. పాలమూరు విశ్వవిద్యాలయంలో కావాల్సిన కోర్సులన్నీ తెచ్చా.. పాలమూరు జిల్లా విద్యాపరంగా రాష్ట్రానికి మోడల్‌గా ఉండాలి. సన్నబియ్యం, ఫ్రీ కరెంట్, ఫ్రీ బస్సు అన్నీ అమలు చేస్తున్నాం.. ఇది చాలదన్నట్లు మా ఆడబిడ్డలు పెట్రోల్ బంకులు, వెయ్యి బస్సులకు యజమానులు అయ్యారు. అంబానీ, అదానీలకు సమానంగా హై టెక్ సిటీలో మా అక్కలకు స్టాల్స్ వచ్చాయి. మీరు ఒక్కసారి ఆశీర్వదిస్తే ఇవన్నీ సాధ్యమయ్యాయి. అందుకే మాకు అండగా ఉన్న పాలమూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. మా మాదిగ సోదరులు వర్గీకరణ కోసం చేయని పోరాటంలేదు.. కానీ సుప్రీంకోర్టు తీర్పు వెంటనే నేను వర్గీకరణ చేసి మాల, మాదిగ పంచాయితీ లేకుండా చేసి చూపించా. బీసీ లెక్క చేసి.. దేశానికి ఆదర్శంగా నిలిచాం. సంక్షోభం దిశలో ఉన్న రాష్ట్రాన్ని సక్కగా చేస్తున్నా. స్థానిక ఎన్నికలపై మాట్లాడుతూ.. కాళ్లల్లో కట్టెలు పెట్టే వారిని సర్పంచులుగా గెలిపిస్తే.. మళ్లీ అడ్డంకులు సృష్టిస్తారు. డిసెంబరు 8, 9వ తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ పెట్టుకుని.. మన తెలంగాణ రాష్ట్ర ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటుదాం. ఇన్ని చేస్తుంటే.. మీరు సర్పంచులుగా వేరే వారిని గెలిపిస్తే.. అభివృద్ధిని అడ్డుకుంటారు. పార్టీలను పదేళ్లు పక్కన పెడదాం.. మన పాలమూరును అభివృద్ధి చేసుకుందాం. ఈ గడ్డ దేశానికి జైపాల్‌రెడ్డి లాంటి నాయకుడిని.. మనకు బూర్గుల రామకృష్ణారావు లాటి తొలి సీఎంను ఇచ్చింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే మమ్మల్ని గెలిపించారో.. ఇప్పుడు సర్పంచులుగా కాంగ్రెస్ నేతలను ఆశీర్వదించి.. మన ప్రభుత్వ అభివృద్ధిని కొనసాగించాలి. మీ అందరి ఆశీర్వాదం తీసుకుని తెలంగాణ రాష్ట్రం మొత్తం తిరుగుతా' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు

# సూపర్ సిక్స్ పథకాలను సక్సెస్ చేసి చూపాం

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని పునఃనిర్మాణం చేసే పనిలో ఉన్నామన్నారు. సుపరిపాలనకు నాంది పలుకుతామని ముందే హామీ ఇచ్చామని, ఇచ్చిన హామీలు నమ్మి ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించారని తెలిపారు. గ్రామసభలు అంటే మొక్కుబడిగా నిర్వహించడం కాదని, ఒక మార్పు రావాలని సీఎం చంద్రబాబు అన్నారు. అభివృద్ధి పనుల వివరాలన్నీ సచివాలయంలో అందుబాటులో ఉండాలని చెప్పారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్న ఏకైక ప్రభుత్వమిది. మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించే సౌకర్యం కల్పించాం. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం అమలు చేస్తున్నాం. సూపర్ సిక్స్ హామీలు ఇస్తే.. అవి అసాధ్యమన్నారు. వాటిని సక్సెస్ చేశాం. 18 నెలల్లో పింఛన్ల కోసమే రూ. 50వేల కోట్లు ఖర్చు పెట్టాం. ఐదేళ్లలో రూ.1.65లక్షల కోట్లు పింఛన్లకు ఖర్చు చేస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఈ స్థాయిలో పింఛన్ల ఖర్చు లేదు. ఒకప్పుడు ఒక నెల పింఛను తీసుకోకపోతే వాటిని ఇచ్చేవారు కాదు. ఇప్పుడు 2,3 నెలల పింఛను ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా హామీలు అమలు చేస్తున్నాం అని వివరించారు. మహిళలకు స్త్రీశక్తి ద్వారా ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాం. రైతాంగం ఆదాయం మెరుగవ్వడం కోసం పంచసూత్రాలు అమలు చేస్తున్నాం. త్వరలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తాం. పోలవరం కుడి కాలువ ద్వారా ఈ ప్రాంతానికి నీళ్లు ఇస్తాం. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి. రైతు సేవా కేంద్రాల ద్వారా ఏయే పంటలు వేయాలి? ఏ మందులు వాడాలి? నీటి సంరక్షణ తదితర వివరాలు తెలియజేస్తాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన మాట అమలు చేసి చూపుతున్నాం అన్నారు. ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తున్నాం. మహిళలను ప్రోత్సహిస్తున్నాం. రాయితీలు ఇస్తాం. ప్రతి జిల్లాల్లో పరిశ్రమలు రావాలి.. కుటుంబానికో పారిశ్రామికవేత్త రావాలి. వ్యవసాయానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూనే పరిశ్రమలు తీసుకొస్తాం. కొల్లేరు సరస్సు సమస్య.. ఎన్నో ఏళ్ల నుంచి ఉంది. దానికి పరిష్కారం చూపుతాం. 2027 గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి చేసి జాతికి అంకితమిస్తాం అని పునరుద్ఘాటించారు. అమరావతి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 2028 నాటికి మొదట దశ పనులు పూర్తవుతాయి. ప్రపంచంలోనే ఇదొక సుందర రాజధాని అవుతుంది. రోడ్ల విషయంలో సమస్యలున్నాయి. జనవరిలోపు రోడ్లపై ఉన్న గుంతలు పూడుస్తామని హామీ ఇస్తున్నా. పవన్ కల్యాణ్ ఒక మాట పదేపదే చెబుతుంటారు. మరో 15 ఏళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలని అంటుంటారని చంద్రబాబు తెలిపారు. తమ ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీకి ఏడాదికి రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో వందమందిలో పదమూడు మందికి పెన్షన్లు ఇస్తున్నామని.. వారిలో 59శాతం మంది మహిళలే ఉన్నారని వివరించారు. తమ ప్రభుత్వానికి కష్టాలు, అప్పులు ఉన్నాయని, ఆదాయం లేదని.. అయినా ఒకేసారి రూ.4వేలకు పింఛన్లు పెంచామని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం ముక్కుతూ, మూలుగుతూ రూ. 250ల చొప్పున పెంచిందని విమర్శించారు. జనాభాను పెంచాల్సిన అవసరం ఉందని.. లేకపోతే మిషన్లతో పనిచేయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు.
గత వైసీపీ ప్రభుత్వం రైతులకు రూ.1650 కోట్లు బకాయిలు పెట్టిందని మండిపడ్డారు. ఆ బకాయిలను తీర్చడమే కాదని, ఇప్పుడు కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా నాలుగు గంటల్లో పైసలు ఇస్తున్నామని వివరించారు. 25 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు పథకాన్ని వినియోగించుకున్నారని గుర్తుచేశారు. ఇప్పటి వరకు రూ.550 కోట్లు ఉచిత బస్సు పథకానికి ఖర్చు చేశామని వెల్లడించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. ఇదిలావుంటే ఏలూరు కలెక్టర్ పనితీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వయంగా తానే గ్రామసభ నిర్వహిస్తున్నానని చెప్పుకొచ్చారు. ప్రజాసమస్యలపై సిబ్బంది కనీస అవగాహన లేకుండా గ్రామసభకు ఎలా వచ్చారని కలెక్టర్ వెట్రి సెల్వినీ సీఎం ప్రశ్నించారు. ఒక గ్రామంలో ఎన్ని టాయిలెట్స్, ఎన్ని ఇళ్లు ఉన్నాయనే కనీస అవగాహన లేకుండా గ్రామసభకు ఎలా వచ్చారని ఫైర్ అయ్యారు. తమ ప్రభుత్వం మొక్కుబడిగా గ్రామసభలు నిర్వహించడం లేదని మండిపడ్డారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల ఆదాయం పెరిగే విధంగా అధికారులు ఆలోచించాలని సూచించారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సిఎంకు పలువురు స్వాగతం పలికారు.

## రైతు వీరన్న ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యత

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయని ఫలితంగా బతుకులు భారమై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు కౌలు రైతులకు ఏడాదికి రూ. 15,000 రైతుభరోసా ఇస్తామని బాండ్లు రాసిచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక మోసం చేయడం దుర్మార్గం. పండించిన పంటను కొనే దిక్కులేక, మద్దతు ధర రాక, దళారుల దోపిడీకి రైతులు బలవుతున్నారు. సెల్ఫీ వీడియోలో వీరన్న చెప్పిన మాటలకైనా ఈ ప్రభుత్వానికి చలనం వస్తుందా? ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు ఎప్పుడు రైతు భరోసా ఇస్తారు? మీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇంకెంత మంది రైతులను బలి తీసుకుంటారు? రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా పర్యటనలో కౌలు రైతు బానోతు వీరన్న కుటుంబాన్ని పరామర్శించాలని, ఆ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. రైతులెవరూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని చేతులు జోడించి విన్నవిస్తున్నాం. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా పోరాటం చేద్దాం.. మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది. వచ్చేది కేసీఆర్ గారి ప్రభుత్వమే.. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయి... ఎవరూ అధైర్యపడకండి అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ట్వీట్ చేశారు.

## మెట్రో రైలు భద్రతా విభాగంలో ట్రాన్స్‌జెండర్లు

మొదటిపేజీ తరువాయి

ఈ చొరవతో మహిళా ప్రయాణికుల భద్రతా మరింత బలోపేతం కావడంతో పాటు సామాజిక సాధికారతకు ప్రతీకగా నిలుస్తుందని మెట్రో యాజమాన్యం వెల్లడించింది. దేశంలోనే అత్యాధునిక నగర రవాణా వ్యవస్థల్లో ఒకటైన మెట్రో రైలు, మూడు కారిడార్లలో 57 స్టేషన్లతో ప్రతిరోజూ సుమారు 5 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తోంది.
ప్రయాణికుల్లో మహిళలు సుమారు 30 శాతం మంది ఉండగా.. వారి భద్రత, సౌకర్యం, విశ్వాసంపై మెట్రో రైలు వ్యవస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. అందులో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెట్రో యాజమాన్యం తెలిపింది. కొత్తగా నియమితులైన వారు.. జనరల్, మహిళలకు ప్రత్యేకంగా కేటాయించిన కోచ్‌లలో భద్రతా చర్యలు చేపట్టడం, ప్రయాణికులకు దిశానిర్దేశం చేయడం, సమాచారం, అవసరమైన సహాయం అందించడానికి అందుబాటులో ఉంటారు. ప్రయాణికులు సౌకర్యవంతంగా, సురక్షితంగా వెళ్లేలా స్కానర్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. స్ట్రీట్-లెవెల్, కాన్‌కోర్స్ భద్రతలో కూడా ట్రాన్స్‌జెండర్‌లు పాలుపంచుకుంటారని మెట్రో యాజమాన్యం పేర్కొంది.

## డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై దర్యాప్తు చేయండి

మొదటిపేజీ తరువాయి

డిజిటల్ అరెస్ట్‌లపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సీరియస్ అయింది. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై దర్యాప్తు ప్రారంభించాలని సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై దర్యాప్తునకు సీబీఐ ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బగ్చి నేతృత్వంలోని బెంచ్ ఈ కేసును సుమోటోగా తీసుకుని విచారించింది. విచారణ సందర్భంగా సీబీఐకి ఆదేశాలు జారీ చేసింది. దేశంలో డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కొంతమంది సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ అధికారులమంటూ జనాలను భయపెట్టి డబ్బులు దోచేస్తున్నారు. 2025లో డిజిటల్ అరెస్ట్ కేసుల సంఖ్య బాగా పెరిగిపోయింది. పెద్ద పెద్ద చదువులు చదివిన వాళ్లు, సెలెబ్రిటీలు సైతం డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ల బారిన పడుతున్నారు. లక్షలు, కోట్ల రూపాయలు పోగొట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై దృష్టి సారించింది. డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలకు అల్పడుతున్న అంతర్జాతీయ సైబర్ ముఠా గుట్టురట్టయింది. డిజిటల్ అరెస్ట్ పేరుతో జనాలను మోసం చేస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సీబీఐ, ఈడీ అధికారులమంటూ కేటుగాళ్లు 48 లక్షల రూపాయలు కాజేశారు. పోలీసులు నిందితుల నుండి 32 లక్షల రూపాయల నగదు 25 ఏటీఎమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

## ఫలించిన మంత్రి తుమ్మల చర్చలు.. పత్తి కొనుగోళ్లపై తొలగిన ప్రతిష్టంభన

మొదటిపేజీ తరువాయి

ఈ అంశంపై కేంద్ర మంత్రులతో పాటు సీసీఐ సీఎండీతో మాట్లాడి.. నిబంధనల్లో మార్పులు చేసేందుకు అంగీకరించేలా ఒప్పించారు. దీంతో రాష్ట్రంలో నోటీపై చేసిన మొత్తం 330 మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు తిరిగి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో ఇప్పటి వరకు సీసీఐ మొత్తం 3.66 లక్షల టన్నుల పత్తిని సేకరించింది. రైతుల వద్ద నిల్వ ఉన్న పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేలా ఇకపై సీసీఐ, జిన్నింగ్ మిల్లులు పనిచేస్తాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయండి...

మొదటిపేజీ తరువాయి

ఈ అంశంపై హడ్కో ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. సానుకూల వృద్ధి రేటుతో ఉన్న తెలంగాణలో ప్రాజెక్టులకు తక్కువ వడ్డీరేటుతో దీర్ఘ కాల రుణాలు ఇవ్వాలని సీఎం కోరారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటికే రుణాలు మంజూరు చేశామని హడ్కో ఛైర్మన్ సీఎం రేవంత్ రెడ్డికి తెలియజేశారు. మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రుణాలు వేగంగా మంజూరు చేయాలని సీఎం కోరగా ఛైర్మన్ కులశ్రేష్ఠ సానుకూలంగా స్పందించారు. ఈ నెల 8, 9వ తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న భారత్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని హడ్కో ఛైర్మన్‌ను సీఎం ఆహ్వానించారు. మావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి కే.ఎస్.శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్, హడ్కో రీజినల్ చీఫ్ పి.సుభాష్ రెడ్డి, హడ్కో జాయింట్ జనరల్ మేనేజర్లు ఆశీష్ గుండాల, సయ్యద్ రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో ఏడో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా శామీర్‌పేట్ పీఎస్

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ పోలీసింగ్ వ్యవస్థ మరోసారి జాతీయ స్థాయిలో సత్తాను చాటింది. కేంద్ర హోంశాఖ దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 10 ఉత్తమ పోలీస్ స్టేషన్లలో.. సైబరాబాద్ కమిషనరేట్‌కు పరిధిలోని శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఏడో స్థానాన్ని దక్కించుకుంది. రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానాన్ని సాధించింది. ఢిల్లీలోని ఘాజీపుర్ ల్యాండ్‌ఫిల్ పోలీస్‌స్టేషన్ తొలిస్థానంలో ఉంది. ఏటా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న, వృత్తిపరమైన ప్రమాణాలను పాటిస్తున్న పది ఉత్తమ పోలీస్ స్టేషన్లను హోంశాఖ ఎంపిక చేస్తుంటుంది.
ఈ ఎంపిక ప్రక్రియలో స్టేషన్ పనితీరు, పరిపాలనా సామర్థ్యం, ఫిర్యాదుదారులతో, బాధితులతో సిబ్బంది వ్యవహరించే తీరు, ఫిర్యాదుల పరిష్కారం, పోలీస్ స్టేషన్ రికార్డులు, డాక్యుమెంటేషన్ నిర్వహణను పరిశీలిస్తారు. ఈ అన్ని ప్రమాణాలలో శామీర్‌పేట్ స్టేషన్ ప్రతిభ కనబర్చడం ద్వారా దేశంలో ఏడో అత్యుత్తమ స్టేషన్‌గా, రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది.
శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ సాధించిన ఈ ఘనత పట్ల ఆ స్టేషన్ సిబ్బందికి ఉన్నతాధికారుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏడీసీపీ పురుషోత్తం, ఏసీపీ మేడ్చల్ బాలగంగిరెడ్డితో పాటు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్.. మొత్తం సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.

## లీజు భూములను కన్వర్షన్ చేసే అవకాశం ఇవ్వలేదు

మొదటిపేజీ తరువాయి

సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. లీజుకు ఇచ్చిన ప్రభుత్వ భూములను కన్వర్షన్ చేసే అవకాశం ఇవ్వలేదని స్పష్టం చేశారు. పట్టాలు ఉండి.. సొంత భూములు ఉన్నవారికే కన్వర్షన్ ఫీజు పెట్టామని తెలిపారు. గత సర్కారే ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే జీవో ఇచ్చిందన్నారు. "భారత రాష్ట్ర సమితి హయాంలో ప్రభుత్వ భూములపై యాజమాన్య హక్కులను పారిశ్రామికవేత్తలకు ఇచ్చే జీవో తీసుకొచ్చారు. ఖాయిలా పడిన పరిశ్రమల భూములను వినియోగంలోకి తెచ్చే ప్రయత్నమే హిల్ట్ పాలసీ. ప్రభుత్వ భూమిపై హక్కును బదిలీ చేస్తున్నామనేది అబద్ధం. హిల్ట్ పాలసీలో ఎస్ఆర్‌వో రేటు కంటే ఎక్కువ ఫీజు నిర్ణయించాం" అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

## హిల్ట్ పాలసీ పేరుతో వేలకోట్ల కుంభకోణం

మొదటిపేజీ తరువాయి

హిల్ట్ పాలసీ పేరుతో రూ.వేలకోట్ల కుంభకోణం జరుగుతోందని గవర్నర్‌కు బిజెపి ఫిర్యాదు చేసింది. తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం గవర్నర్‌ను కలిసింది. అక్రమాలు జరగకుండా చూడాలని వినతిపత్రం అందజేసింది. గవర్నర్‌ను కలిసిన వారిలో భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, ఎన్వీ సుభాష్ తదితరులు ఉన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' (హిల్ట్) పాలసీని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. 'హిల్ట్ పాలసీ ద్వారా అక్రమాలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 9 వేల ఎకరాలను రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు
యత్నిస్తోంది. అప్పటి, ఇప్పటి ధరలు పోల్చి చూస్తే అక్రమాలు తెలుస్తున్నాయి. కోకాపేటలో భూముల ధర ఇటీవల ఎంత పలికిందో మనం చూశాం. ఈ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 7న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తాం. జీహెచ్‌ఎంసీ విస్తరణలోనూ అనేక కుట్రలు ఉన్నాయని నేతలు ఆరోపించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. హిల్ట్ పాలసీని వ్యతిరేకిస్తూ గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇండస్ట్రియల్‌కు కేటాయించిన భూములను హిల్ట్ పేరుతో రియల్ ఎస్టేట్‌గా మారుస్తూ కోట్ల రూపాయలు అవకతవకలకు తెర లేపుతున్నారని ఆరోపించారు. మార్కెట్ వాల్యూ కన్నా తక్కువ రేట్లకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. 6 లక్షల 30 వేల కోట్ల విలువైన 9292 వేల ఎకరాల భూములను కేవలం 5 వేల కోట్లకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందా..? పరిపాలన చేస్తుందా.. అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు పరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందింది కాబట్టే ఇండస్ట్రియల్ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టి లబ్ధి పొందుతున్నారని వ్యాఖ్యలు చేశారు. హిల్ట్‌కు వ్యతిరేకంగా ఈనెల 7న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా చేపట్టబోతున్నామని ప్రకటించారు. హిల్ట్ పాలసీపై ప్రభుత్వంతో చర్చిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు వెల్లడించారు. ప్రభుత్వ వైఫల్యాను వ్యతిరేకంగా 7న నిరసన దీక్ష చేపట్టబోతున్నామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రకటించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం డిసెంబర్ 2 2025

# జగిత్యాల జిల్లాలో ఎన్నికల కోడ్

## - కలెక్టర్ ఆదేశాలు

**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం ప్రతినిధి**




జగిత్యాల జిల్లాలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, జిల్లా కలెక్టరేట్ లో మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ మరియు సహాయ కేంద్రం ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తెలిపారు. మూడు విడతల్లో జరిగే ఎన్నికల సమయంలో ఏవైనా సమస్యలుంటే 24ఐ7 అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నెంబర్ 9666234383 ను సంప్రదించాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి.నరేష్, జిల్లా పౌరసంబంధాల అధికారి పి.నరేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.భాస్కర్ లను నోడల్ అధికారులుగా నియమించారు.

# జగిత్యాలలో సీసీ పుటేజీకి చిక్కిన దొంగలు




**జాగిలం కిరణ్, జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్‌లో ఆదివారం, బురా? ధరించిన మహిళ ఒక వ్యక్తితో కలిసి జువెలరీ షాప్‌కు వెళ్లింది. ఖరీదైన బంగారు ఉంగరాలను చూపించమని కోరిన తర్వాత, వ్యాపారి చూపించిన ఉంగరాలలో ఒకదాన్ని పరిశీలిస్తున్నప్పుడు, చాకచక్యంగా తనతో తెచ్చుకున్న నకిలీ ఉంగరాన్ని పెట్టి, అసలు బంగారు ఉంగరాన్ని దొంగిలించి పారిపోయింది. ఈ సంఘటన సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# వేంపేట్ లో గీతా జయంతి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**

గీతా జయంతి సందర్భంగా వేంపేట శ్రీ రామకృష్ణ సంకీర్తన మండలి లో సంపూర్ణ భగవద్గీత పారాయణం జరిగింది ఉదయం 5 గంటలకు ప్రార్థన శ్రీకృష్ణ అష్టోత్తర శతనామావళి ఒకటవ అధ్యాయము నుండి 18 వ అధ్యాయం వరకు పారాయణం చేయడం జరిగింది మండలి సభ్యులు మహిళలు అనేకమంది పాల్గొన్నారు.

మార్గశిర మాస శుద్ధ ఏకాదశి రోజున శ్రీకృష్ణుడు అర్జునునికి భగవద్గీత సందేశం అందించిన ఈ ఏకాదశి రోజున కావున ఈరోజు గీతా జయంతిగా ప్రఖ్యాతిగాంచింది.

# కథలాపూర్ లో ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం ప్రతినిధి**

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కథలాపూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కథలాపూర్ లో హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించి, అడ్డంకులను అధిగమించి, ఎయిడ్స్ ప్రతిస్పందనను మారుద్దామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి సింధూజ, సీహెచ్ఓ వేణుగోపాల్, శ్రీధర్, విజయ్, శ్రీలత, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్నారిని దారుణంగా కొట్టిన స్కూల్ ఆయా

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

మేడ్చల్ జిల్లా జీడిమెట్ల పీఎస్ పరిధి షాపూర్ నగర్‌లోని పూర్ణిమా స్కూల్‌లో నర్సరీ చదువుతున్న చిన్నారిని స్కూల్ ఆయా దారుణంగా కొట్టింది. ఆయా కొట్టడంతో భయాందోళన చెందిన చిన్నారికి తీవ్ర జ్వరం రావడంతో తల్లిదండ్రులు రామ్ హాస్పిటల్‌కు తరలించారు. పాపను ఆయా కొట్టిన వీడియోను పోలీసులకు చూపించి ఫిర్యాదు చేయడంతో, పోలీసులు ఆయాను అదుపులోకి తీసుకున్నారు.



# ఈటెల రాజేందర్ పై అనుచిత వ్యాఖ్యలు సహించం

## - జాకట ప్రేమ్ దాస్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

మేడ్చల్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్ దాస్, కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించడంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ను ఉద్దేశించి, బీసీ డిక్లరేషన్ ఎవరిని అడిగి చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు మోసం చేస్తోందని, వారి పాలనలో ఎంతమందికి మంత్రి పదవులు ఇచ్చారో ఆలోచించుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మల్కాజ్ గిరి ఎంపీగా ఉన్నప్పుడు ప్రజల వద్దకు రాలేదని, కానీ ఇప్పుడు మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ప్రతి క్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నారని ప్రశంసించారు. పనిచేసే నాయకుడిపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# రావల్ కోల్ నుండి పూడూర్ వాగు వరకు వీధిలైట్లు



## - సీపీఎం వినతి

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

మేడ్చల్ లోని రావల్ కోల్ గ్రామం నుండి పూడూర్ వాగు వరకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సీపీఎం పార్టీ నాయకులు ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. రావల్ కోల్ గ్రామం నుండి కామన్ వైపు వెళ్లే దారిలో లైట్లు లేకపోవడం వల్ల ప్రజలు, ముఖ్యంగా మహిళా కార్మికులు రాత్రిపూట ఇబ్బందులు పడుతున్నారని, దొంగతనాలు కూడా పెరుగుతున్నాయని సీపీఎం పార్టీ మేడ్చల్ మండల కార్యదర్శి ఎం. నరేష్ తెలిపారు. సమస్యను సానుకూలంగా స్వీకరించిన మున్సిపల్ కమిషనర్, వీలైనంత త్వరగా లైట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొమురయ్య, నర్సింగ్ రావ్, పూజ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో మహిళ మృతి

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



సూరారం కాలనీ ముత్యాలబస్తీలో శనివారం ఉదయం సీతల్ రాథోడ్ (23) అనే గృహిణి దుస్తులు ఉతుకుతూ, నీళ్లు వేడి చేయడానికి అమర్చిన హీటర్ ను ప్రమాదవశాత్తు తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. భర్త విజయ్ రాథోడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బోడుప్పల్ ప్రైవేట్ హాస్పిటల్ లో దారుణం



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

బోడుప్పల్ లోని ఓ మల్టీ స్పెషాలిటీ ట్రస్ట్ హాస్పిటల్ లో డబ్బులు చెల్లించలేదని నాగమ్మ(40) అనే మహిళకు ఆక్సిజన్ తీసేయడంతో ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని డబ్బులు కట్టి తీసుకెళ్లాలని ఆస్పత్రి యాజమాన్యం ఒత్తిడి తెచ్చింది. డబ్బులు లేవని కుటుంబ సభ్యులు చెప్పడంతో, మహిళలను బాత్రూమ్ లు కడగాలని, వాచ్ మెన్ గా పనిచేయాలని బెదిరించినట్లు సమాచారం. ఈ ఘటనపై ఆస్పత్రి ముందు మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ కి యువకుడు బలి

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధి శాంతినగర్ లో ఆన్‌లైన్ బెట్టింగ్ కు బానిసైన పాలడుగు సాయి (24) అనే యువకుడు అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి అన్న నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఏవిబి పురంలో మహాశాస్తా అయప్ప స్వామి 12వ వార్షికోత్సవ మహా కుంభాభిషేక మహోత్సవం...

## – ప్రత్యేక పూజలు చేసిన జనసేన పార్టీ నేత ఉమ్మారెడ్డి ప్రేమ కుమార్...



**కరపత్రం ప్రతినిధి కూకట్పల్లి**

కూకట్పల్లిలోని ఏ.వి.బి పురం శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి వార్ల దేవస్థాన ప్రాంగణంలో మహాశాస్తా అయ్యప్ప స్వామి వారి 12వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజాలకు కూకట్‌పల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పలి నారాయణ, జనసేన నాయకులు కొల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్, శివ శంకర్,సింమాద్రి, గోవింద్, ప్రసాద్, పులగం సుబ్బు, ఆనందరావు కాలనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్పల్లి శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవాలయం పూజారి పదవి విరమణ...




## - ముఖ్యఅతిథిగా పాల్గొన్న పిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్....

**కరపత్రం ప్రతినిధి కూకట్పల్లి**

కూకట్పల్లి గ్రామంలోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీ కరద్కర్ గోపాల్ శర్మ పదవి విరమణ సందర్భంగా ఆలయంలో ఉద్యోగ విరమణ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులుగా దేవాలయానికి చేసిన సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గొట్టిముక్కల వెంకటేశ్వరరావు పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో బండి రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చైర్మన్ గొట్టిముక్కల నగేష్, రంగా భాస్కర్ గౌడ్, వెంకట్రావు, విద్యాసాగర్ రావు, శారద, శ్రీకాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భరత్ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి... సంక్షేమ సంఘం అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి...



**కరపత్రం ప్రతినిధి కూకట్పల్లి**

కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, కార్యవర్గ సభ్యులు బాబు రాజు, అప్నా బజార్ నరేష్, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, మధుసూదన్ రావు, జగదీష్ తదితరులు మూసాపేట జిహెచ్ఎంసి కార్యాలయంలో అధికారులను కలిసి భరత్ నగర్ కాలనీ సమస్యల పట్ల సోమవారం వినతి పత్రం అందించారు. గత రెండు నెలలుగా ఎన్నోదపాలుగా వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోలేదు అని ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహిస్తున్నారని నాగిరెడ్డి అన్నారు. మీరు చేస్తారని నమ్మకంతో ఈసారి కూడా వినతిపత్రం ఇస్తున్నామని ఈ సమస్యల పట్ల చర్యలు తీసుకోకపోతే మేము సంబంధిత శాఖ మంత్రులను కలిసి వారికి ఇక్కడ పరిస్థితిని తెలియజేస్తాము అన్నారు. మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ ఉద్యోగుల కొరత ఉందని అందువల్లే సమస్యల పరిష్కారం ఆలస్యం అవుతుంది అని తెలియజేశారు. దీనికిగాను నాగిరెడ్డి స్పందించి మీ దగ్గర ఉద్యోగులు లేకపోతే కాలనీ నుండి మేమే వచ్చి శ్రమదానం చేస్తాము మీరు వచ్చి చర్యలు చేపట్టండని తెలియజేశారు. ప్రజల సమస్యలు తీరుస్తాము అనే నమ్మకంతో భారత్ నగర్ ప్రజలు ఓటు వేసి మా సంక్షేమ సంఘాన్ని ఎన్నుకున్నారని వారి సమస్యల పరిష్కారం కోసం మేము నిరంతరం కృషి చేస్తున్నాము అన్నారు. ప్రభుత్వ జీతాలు తీసుకునే ఉద్యోగులు ఇలా నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకోమని నాగిరెడ్డి హెచ్చరించారు.

# మెరుగైన వైద్య సదుపాయాల కల్పన కు ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే నల్లమిల్లి

**కరపత్రం ప్రతినిధితూ.గో.జిల్లా (అనపర్తి/మెళ్ళూరు):**



మారుతున్న జీవనశైలితో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అవసరమని, ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం బిక్కవోలు మండలం మెళ్ళూరులో రూ. 32.50 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనం ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

- అడ్వర్టయిజ్మెంట్ల బకాయిలను చెల్లించాలి
- జాప్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య
- సమాచార భవన్ ఎదుట జర్నలిస్టుల భారీ ధర్నా






**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, డిసెంబర్ 01:** తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టులు సోమవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార శాఖ కమీషనరేట్ (సమాచారభవన్) ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకు చెంది అనేక మంది జర్నలిస్టులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని జర్నలిస్టులు ముక్తకంఠంతో నిరసించారు. సమస్యలను పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య ధర్నానుద్దేశించి మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు కావస్తున్నా... జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కరించలేదని, కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని అన్నారు. జర్నలిస్టులకు ఇస్తామన్న ఇళ్లస్థలాల ఊసే లేదని, కోర్టు తీర్పు సాకుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అన్నారు. ఆరోగ్య భీమా పథకాన్ని అటకెక్కించారని, చిన్న మధ్య తరహా పత్రికలను సంక్షోభంలో పడేసారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. జర్నలిస్టులకు గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందంటే...అంతకంటే ఎక్కువగా ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని అన్నారు. జర్నలిస్టుల సమస్యలను త్వరగా పరిష్కరిస్తామంటూ ముఖ్యమంత్రి, సమాచార శాఖ మంత్రి పలు మార్లు హామీలిచ్చారే తప్ప ఆచరణలో పెట్టలేదని, చివరికి జర్నలిస్టుల ప్రతినిధిగా ఉన్న మీడియా అకాడమీ ఛైర్మన్ కూడా కమిటీల పేరుతో కాలయాపన చేసి చివరికి చేతులెత్తేశారని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడం లేదని, ఇది చాలా అన్యాయమని, ప్రత్యామ్నాయ జీవో ద్వారా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలలో ప్రధానమైన ఇండ్ల స్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు,హెల్త్ కార్డులతో పాటు జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో ఉచిత విద్య, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, చనిపోయిన జర్నలిస్టు కుటుంబానికి ప్రభుత్వం ఇస్తున్న లక్ష రూపాయల సహాయాన్ని రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. చిన్న పత్రికలను ఎంపానెల్ లో చేర్చాలని, అడ్వర్టయిజ్మెంట్ పెంటింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మామిడి సోమయ్య కోరారు. ఈ ధర్నాలో ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కో-కన్వీనర్లు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, తన్నీరు శ్రీనివాస్, ఆర్.వెంకటేశ్వర్లు, కుడుతాడి బాపురావు, ఎం.యాదగిరి, కె.పాండురంగారావు, వివిధ జిల్లాల నాయకులు కంతేటి రమాదేవి, పద్మనాభరావు, ఉదయ్ భాస్కర్ రెడ్డి, గిరిబాబు, అక్బర్ పాషా, పంతాటి రవీందర్, పి.గోపాల్, ఎం.గోపాల్, జక్కుల విజయకుమార్, స్వామిదాస్, మిట్టపల్లి మధు, సత్యగౌడ్, సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్, పర్వతాలు, నీల నరేష్ , మల్లేష్, అశోక్,శంకర్, డప్పు రామస్వామి, శాంతి, సౌభాగ్యవతి, సుష్మ, మంజులారెడ్డి, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమాచార పౌరసంబధాల శాఖ కమీషనర్ కు ఇచ్చే వినతి పత్రాన్ని జాయింట్ డైరెక్టర్ డీ ఎస్ జగన్ కు అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని జగన్ హామీ ఇచ్చారు.



## శ్రీ సరస్వతీ శిశు మందిర్ హై స్కూల్ ఇ. మీ కరీంనగర్ లో ఘనంగా గీతా జయంతి వేడుకలు



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 1**

కరీంనగర్ శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. గీతా జయంతి సందర్భంగా పాఠశాలలోని చిన్నారులందరూ 12 వ అధ్యాయం, భక్తి యోగం అష్టాదశ శ్లోకీ గీత పఠనం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బల్మూరి కరుణాకర్ రావు, నర్సింగరావు, శ్రీనివాస్ రావు, సి ఎ మహేష్, శ్రీకృష్ణ భగవానుడి గొప్పతనాన్ని తెలియజేస్తూ ఇంటింటికి భగవద్గీత లో భాగంగా డాక్టర్ నాళ్ల సత్య విద్యసాగర్ భగవద్గీత పుస్తకాలను విద్యార్థులకు, ఆచార్యులకు ఇతర ఉద్యోగులకు కూడా అందించారు.

ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందున ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ,మేచినేని దేవేందర్ రావు, గట్టు శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, గోలి పూర్ణచందర్, కొత్తూరి ముకుందం, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్,పులాల శ్యామ్, గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకులా దేవి, తదితరులు అభినందనలు తెలియ చేసారని పాఠశాల ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి తెలిపారు.

## లోక కళ్యాణం కొరకు భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

- కోడె మొక్కులు చెల్లించిన ఆలయ ఈవో ఎల్. రమాదేవి

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి బాలాలయంగా రూపుదిద్దుకున్న శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో లోక కళ్యాణం, విశ్వ శాంతి కొరకై సోమవారం ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామివారికి కోడె మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించగా, భక్తుల శ్రేయస్సు కోసం ప్రత్యేక శాంతి హెూమాన్ని నిర్వహించారు.

**గేటు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం**





భీమేశ్వరాలయానికి పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా భీమేశ్వరాలయం నుండి పార్వతీపురం వెనుకవైపు వీఐపీ రోడ్డులో కొత్తగా క్యూ లైన్ నిర్మించారు. నటరాజ విగ్రహం కూడలి వద్ద ఈ క్యూ లైన్ రోడ్డుపైనే ఉండడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో అక్కడ అధికారులు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించి అందుబాటులోకి తేవడంతో భక్తులకు ఇబ్బందులు తొలిగాయి. అదేవిధంగా పార్వతీపురం ధర్మశాలలో బస చేసే భక్తుల వాహనాలు భీమేశ్వరాలయం వైపు రాకుండా ఉచిత అన్నదాన సత్రం ముందు కొత్తగా గేటు నిర్మాణం చేపట్టారు. ఈ గేటు నిర్మాణంతో వాహనాలు లోపలికి రాకుండా నివారించడంతోపాటు ట్రాఫిక్ సమస్య తప్పినట్లయింది.

## చిలుకలయ్య గుడిలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), డిసెంబర్ 1:**



ఎన్టిపిసి భీమునిపట్నంలోని చిలుకలయ్య గుడిలో అయ్యప్ప స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ మేళం ప్రత్యేకతను చాటుకుంది. పూజల అనంతరం అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. బ్రహ్మశ్రీ అరుణ్ కుమార్ నంబూద్రి, ఏసీపి రమేష్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ చేతుల మీదుగా ప్రారంభించారు. భక్తీ, క్రమశిక్షణతో మండల దీక్షలను పూర్తి చేసుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఏసిపి రమేష్ ఈ సందర్భంగా తెలిపారు. సోమవారం నుంచి జనవరి 14వ తేదీ వరకు అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఐఎంఏ కరీంనగర్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ .

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 1**






ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సుమారు 200 మందికి పైగా సీవీఎం కళాశాల విద్యార్థులు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహాత్మా జ్యోతిబా ఫూలే పార్కు నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన తెలంగాణ చౌరస్తా, ప్రతిమ మల్టిప్లెక్స్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వద్ద ముగిసింది.

ఈ సందర్భంగా ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రమణాచారి మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్ఓ ఈ సంవత్సరం నిర్ణయించిన థీమ్ "ఓవర్‌కమింగ్ డిస్రప్షన్, ట్రాన్స్‌ఫార్మింగ్ ది ఎయిడ్స్ రెస్పాన్స్" అని గుర్తుచేశారు. వ్యక్తిత్వ వికాసం, నీతి-నిబంధనలకు కట్టుబడి ఉండడం వంటి జీవన విలువలు ఎయిడ్స్ వంటి వ్యాధులను నివారించడంలో కీలకమని ఆయన పేర్కొన్నారు.

అనంతరం ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ అకుల శైలజ మాట్లాడుతూ, ఎయిడ్స్ సోకిన కుటుంబాలు ఇప్పటికీ సమాజంలో వివక్షను, సామాజిక ముద్రను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారు పడుతున్న మానసిక-సామాజిక సమస్యలను సమాజం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మహేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎయిడ్స్ గుర్తింపు, చికిత్స కోసం అందుబాటులో ఉన్న యాంటీ రెట్రోవైరల్ చికిత్స (ఏఆర్‌టీ ) సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు డాక్టర్ వర్షి, డాక్టర్ నీలిమ ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డర్మాటాలజీ విభాగాధిపతి డాక్టర్ అంజిబాబు, డాక్టర్ రమేష్ కొల్లూరి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సునీల్ రెడ్డి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ గీతా రెడ్డి, డాక్టర్ రవికాంత్, డాక్టర్ సాయి కృష్ణ, డాక్టర్ ఆదేపు సైలజ, సీవీఎం చైర్మన్ డాక్టర్ చాట్ల శ్రీధర్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ వాహనం తనిఖీ

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి చెక్ పోస్ట్ వద్ద వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వాహనాన్ని సోమవారం అధికారులు, పోలీసులు సంయుక్తంగా తనిఖీ చేశారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ఆది శ్రీనివాస్ వాహనాన్ని అధికారులు ఆపి క్షుణ్ణంగా చెక్ చేశారు.వారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పూర్తిగా సహకరించారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

## మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్

- నర్సాపూర్ మండల అధ్యక్షులు నీలి నగేష్ ఆధ్వర్యంలో
- ఎల్లాపూర్ గ్రామపంచాయతీ బిజెపి సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నిక






మెదక్ జిల్లానర్సాపూర్ భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కార్యాలయంలో బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ మండల అధ్యక్షులు నీలి నగేష్ అధ్యక్షతన ఎల్లాపూర్ గ్రామానికి చెందిన మొగులయ్య సోమవార నాడు భారతీయ జనతా పార్టీలో చేరడం జరిగింది. అదేవిధంగా ఎల్లాపూర్ సర్పంచ్ బిజెపి అభ్యర్థిగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లో మూడవఈ సారీ మోడీ హరి పాలన సాగుతుంది అంటే దేశ ప్రజలే భారతీయ జనతా పార్టీకి జై అంటున్నారు రానున్న ఎన్నికలలో బిజెపి సర్పంచ్ అభ్యర్థులుగా నియమించిన వారు గెలుపు ఖాయమని నర్సాపూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామపంచాయతీలు బిజెపి సర్పంచ్ అభ్యర్థులుగా నిలిపి వర్గ బిజెపి పార్టీ కార్యకర్తలు సర్పంచ్ అభ్యర్థికి సహకరించివారి గెలుపు కోసం ప్రతి ఒక బిజెపి కార్యకర్త నాయకులు అందరం పాల్గొని వారి విజయాలకు విజయ సూచికలు కావాలని వారు తెలియజేశారు కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాదే బాలరాజు ఎల్లాపూర్ బూత్ అధ్యక్షులు నాగరాజు మండల ఉపాధ్యక్షులు శ్రీకాంత్ పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘసాని రాజు పట్టణ కో కన్వీనర్ నరేందర్ బూత్ అధ్యక్షులు మల్లేష్ మాజీ భూత అధ్యక్షులు వీరేష్ బిజెపి సభ్యులు నాగేష్ గౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.